క్లుప్తంగా

రేపు గ్రూప్‌-2 మెంటల్ ఎబిలిటీపై ఉచిత శిక్షణ

తెనాలిఅర్బన్: యూటీఎఫ్, జేవీవీ, ఎన్‌జీవో అసోసియేషన్ తెనాలి వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం గ్రూప్‌-2 ప్రిలిమ్స్‌లోని మెంటల్ ఎబిలిటీ సబ్జెక్టుపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేటలోని ఎన్‌జీవో కళ్యాణ మండపంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అమిరిశెట్టి శ్రీధర్ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రిలిమ్స్ పరీక్ష రాయనున్న విద్యార్థులు దీనిని ఉపయోగించుకోవాలని కోరారు.

ఆశ్రమంలో దుస్తులు పంపిణీ



తెనాలిటౌన్: లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు లయన్ మెల్విన్ జోన్స్ జన్మదినం సందర్భంగా పట్టణ గాంధీనగర్‌లోని సాయిసేవాసమితి ఆశ్రమంలో వృద్ధులకు, పేదలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బంజారా పెరల్స్ (హైదరాబాద్), వెంకటేశ్వర యోగసేవా కేంద్రం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్ జయామోహన్ బుర్రా, లయన్ శారదాచలపతి, ఎస్వీ యోగ కన్వీనర్ ఎం.రమణయ్య పాల్గొన్నారు.

కనులపండువగా పుట్టలమ్మతల్లి సంబరాలు



గుంటూరు రూరల్: నల్లపాడు చల్లావారిపాలెం గ్రామ ప్రజల ఇలవేల్పు దేవత పుట్టలమ్మతల్లి ఘంటాలమ్మతల్లి ఆలయ సంక్రాంతి సంబరాలు కనుల పండుగగా జరుగుతున్నాయి. రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలను నిర్వహించారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా ఆలయంలో వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ ఊరేగింపు రథానికి కొబ్బరికాయలు కొట్టి పూజించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికి శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సమన్వయకర్త మాట్లాడుతూ అమ్మవారి కృప కటాక్షాలు ప్రజలకు ఎల్లప్పుడూ ఉండాలని ప్రజలంతా సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఊరేగింపు ఆసాంతం కనుల పండువగా సాగింది. ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి మాట్లాడుతూ సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం శ్రీ లక్ష్మీనరసింహ మహిళా కోలాట బృందం కోలాటం, 8 గంటలకు అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలందుకున్న 9 కిలోల లడ్డూ వేలం జరుగుతుందని తెలిపారు. లడ్డూను వేలంలో పాడుకున్న భక్తులకు 9 గ్రాముల బంగారు అమ్మవారి లాకెట్‌ను ఇంటూరి వీరారెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలు అందజేయనున్నారన్నారు. 100 అడుగుల ఎలక్ట్రిక్ ప్రభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నిత్యావసరాలు పంపిణీ

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ వృద్ధులను, దివ్యాంగులను ఆదరించాలని శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామడి మురళీకృష్ణ అన్నారు. ఆదివారం కొత్తపేటలోని సమితి కార్యాలయంలో వంద మంది వయో వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, పది రకాల నిత్యావసర వస్తువుల కిట్లు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మామిడి మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజంలో అనేక మంది వృద్ధులు ఎటువంటి ఆదరణ లేక జీవిస్తున్నారని, అటువంటి వారికి తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు నేరెళ్ల కొండలరావు, ఇస్కాన్ దేవాలయం ప్రతినిధి వీరగోవింద ప్రభూజీ, సభ్యులు మాదాల ప్రకాష్, పలకలూరి శివరావు, పోలేపల్లి వెంకటసుబ్రమణ్యం, ఎస్వీ రమణ, టి.మురళీసాయి, అరుణకుమారి, పోలేపల్లి హరి తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్: అందరికీ విద్య, ఉపాధి కోసం ఆవిర్భవించిన డీవైఎఫ్ఐ ఆయా అంశాలపై నిరంతర కృషి చేస్తోందని సంఘ మాజీ జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని భారత ప్రజాతంత్ర సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా కమిటీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అప్పారావు మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటాలు, ఉద్యమాలతో సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తోందని తెలిపారు. డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ మాట్లాడుతూ చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని కోరారు. ఎస్‌కే బాషా, ఎస్. కార్తీక్, ఎం.కిరణ్ కబీర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సమీర్ పాల్గొన్నారు.

సందడిగా భోగి పండుగ



ఐతానగర్‌లో భోగి మంటలు వేస్తున్న మహిళాకమిషన్ మాజీ చైర్‌పర్సన్ రాజకుమారి, మహిళలు



రామలింగేశ్వరపేటలో భోగి మంటలు వేస్తున్న యువకులు

తెనాలిటౌన్: భోగి పండుగ వేడుకలను ఆదివారం ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి యువకులు పట్టణంలోని పలు సెంటర్లలో భోగి మంటలు వేశారు. మహిళలు, యువతులు తమ ఇళ్ల ముందు రంగులతో ముగ్గులు వేశారు.

■ పట్టణంలోని వహాబ్‌చౌక్ సెంటర్లో వేసిన భోగి మంటల కార్యక్రమంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు పసుపులేటి త్రిమూర్తి, దేసు యుగంధర్, అనిత, అరుణ, జొన్నాదుల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

■ పట్టణ ఐతానగర్‌లో భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

■ పలు సెంటర్లలో వేసిన భోగి మంటల్లో యువకులు, చిన్నారులు సందడి చేశారు. పెద్దలు తమ ఇళ్లల్లో ఉన్న పాత వస్తువులను భోగి మంటల్లో వేశారు. ఉదయం నుంచి హరిదాసులు ఇంటింటికి తిరిగి హరి కీర్తనలు ఆలపించారు.

చెడు ఆలోచనలు భోగి మంటల్లో కలసిపోవాలి

ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: తెలుగు ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల ప్రజలు, రైతులు జరుపుకునే పండుగ సంక్రాంతి అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని చెంచల రామిరెడ్డి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన భోగి వేడుకల్లో ఎమ్మెల్యే శివకుమార్, పుష్ప దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని భోగి మంటలను ప్రారంభించి సందడి చేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. చిన్నారులకు గాలిపటాలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట చేతికి వచ్చి రైతులు, ప్రజలు చిన్న, పెద్ద అంతా కలసి సంతోషంగా జరుపుకొనే గొప్ప పండుగ సంక్రాంతి అని అన్నారు. చెడు ఆలోచనలు, పీడలు భోగిమంటల్లో కలసిపోవాలని అన్నారు. రైతన్నలకు అన్నీ శుభాలే జరగాలని ఆకాంక్షించారు. తొలుత నియోజకవర్గం, మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చెంచల రామిరెడ్డి, తెనాలి వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ అవుతు సీతనగేష్‌రెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, ఈదా యస్వంత్‌రెడ్డి, జొన్నల శివారెడ్డి, ఆరిగ చంద్రారెడ్డి, ఉయ్యూరు ఉమమహేశ్వరరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, పుష్ప దంపతులు

ఆర్టీసీ బస్సు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు



చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ముగ్గురు యువకులకు గాయాలైన సంఘటన మండల కేంద్రమైన చేబ్రోలులోని సినిమాహాలు ప్రాంతం వద్ద ఆదివారం జరిగింది. పొన్నూరు రూరల్ మండలం బ్రాహ్మణకోడూరు గ్రామానికి చెందిన యువకులు ఎ.అనీల్, కె.అనీల్, జయవర్ధన్‌లు ద్విచక్ర వాహనంపై చేబ్రోలుకు బయలుదేరారు. మార్గమధ్యలో చేబ్రోలు సినిమా హాలు సమీపంలో పొన్నూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈఘటనలో ముగ్గురు యవకులకు కాళ్లు విరగటంతో పాటు, తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



పట్టాభిరామస్వామి దేవస్థానంలో కల్యాణంలో కౌన్సిలర్ సంజీవరెడ్డి దంపతులు



కల్యాణంలో పాల్గొన్న మహిళలు

తెనాలిటౌన్: పట్టణ, రూరల్ గ్రామాల్లోని పలు ఆలయాల్లో గోదాదేవి కల్యాణం ఆదివారం వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంగానమ్మపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం జరిపారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

■ బాలాజీరావుపేటలోని పట్టాభిరామస్వామి దేవస్థానంలో గోదాదేవి కల్యాణం వైభవంగా జరిపారు. కౌన్సిలర్, ఆలయట్రస్టీ పేరం సంజీవరెడ్డి, వరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు వేదాంతం నాగమారుతి కల్యాణం జరిపారు.

■ రూరల్ మండలం అంగలకుదురులోని రుక్మిణీసత్యభామ వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం జరిపారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు కల్యాణం నిర్వహించారు. వెండి పాదుకలు, వెండి పళ్లెం, ఢమరుకం ఆలయానికి సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, అలపర్తి సుధాకర్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

■ బాలాజీరావుపేటలోని అయ్యప్ప ప్రధాన ఆలయంలో భోగి పండుగ సందర్భంగా ఆలయ అర్చకులు హరిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

■ వీఎస్ఆర్ కాలేజీ రోడ్డులో ధనుర్మాసం వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ధనుర్మాసం ముగింపు సందర్భంగా ఆదివారం రామానుజదాసస్వామి ప్రత్యేక పూజలు జరిపారు. గోదాదేవి కల్యాణం నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.



వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ధనుర్మాసం ముగింపు వేడుకల్లో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలి

కొల్లిపర: భావితరాల వారికి మన సంప్రదాయాలను, పల్లెటూళ్లను గుర్తుకు చేయాలనే తలంపుతోనే స్థానిక శ్రీకళా నిలయం ఆధ్వర్యంలో ప్రతి ఏటా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సంక్రాంతి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త కూరపాటి రవిశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రాంగణంలో శ్రీ కళా నిలయం ఆధ్వర్యంలో సంక్రాంతి సాంస్కృతిక సంబరాలు ప్రాంభించారు. ఈ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన అవుతు కృష్ణారెడ్డ్ చేశారు. అనంతరం విద్యార్థుల ప్రత్యేక నృత్య ప్రదర్శనలు, చైతన్య కళాభారతి, కరీంనగర్ వారి స్వప్నం రాల్చిన అమృతం నాటిక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకళా నిలయం అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి గుదిబండి మహేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులు ఆరిమంద పెద్ద నాగిరెడ్డి, సహాయ కోశాధికారి అన్నవరపు రమేష్, కార్యవర్గ సభ్యులు ఆరిమండ శివశంకరరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో సంక్రాంతి సాంస్కృతిక సంబరాలలో విద్యార్థుల ప్రదర్శనలు

అ'పూర్వ' కలయిక

19 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు



నాటి, నేటి గురువులతో 2004- 05 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

పెదనందిపాడు: పాఠశాల పూర్వ స్నేహితులంతా ఒక్కచోట చేరారు. ఆ సంతోషం, ఆ ఉద్వేగం.. చెప్పతరమా అలనాటి జ్ఞాపకాలు నేమరువేసుకున్నారు. అప్పట్లో పాఠశాలలో చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆదివారం ఉదయం మండల పరిధిలోని అన్నవర్రు కేఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక జరిగింది. పాఠశాలలో 2004–05 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఒక్కచోట సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ అభ్యున్నతికి మార్గం చూపిన గురువులు బి.సత్యం, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రమణకుమారి, ఉమామహేశ్వరిలను వారంతా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రశేఖర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

గుంటూరు రూరల్: పండుగలు మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేస్తాయని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా 40వ డివిజన్ జన్మభూమినగర్‌లో స్థానిక కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు సమన్వయకర్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగు ప్రజలకు పెద్ద పండుగని తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తురకపాలెంలో క్రికెట్ పోటీలు..

క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడాకారులు నైపుణ్యతలు మెరుగు దిద్దుకునే దిశగా కృషిచేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం తురకపాలెంలో డాక్టర్ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ మ్యాచ్ విజేతలకు బహుమతులు ఆయన అందజేశారు. గ్రామ సర్పంచ్ డబ్బూరి సూర్యప్రకాశరావు, మిర్చియార్డు డైరెక్టర్ ఇంద్ర, ఆర్‌అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని రామనాథం చినకోటయ్య శివపార్వతమ్మ వృద్ధుల సేవా ఆశ్రమంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆశ్రమ అధ్యక్షుడు రామనాథం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శిబిరానికి విశేష ఆదరణ లభించిందని, సుమారు 100 మంది వరకు కంటి పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. 50 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశామని తెలిపారు.

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్



సంప్రదాయబద్ధంగా కోడి పందేలు ప్రారంభిస్తున్న ఎంపీ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగని అటు వంటి పండుగని ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలో చెంచల రామిరెడ్డి ఇటుక బట్టిలో సంప్రదాయబద్ధంగా కోడి పందేలు, ఒంగోలు జాతి వృషభరాజముల బల ప్రదర్శన కార్యక్రమం ఎంపీ రామిరెడ్డి ముఖ్యఅతిధులుగా పాల్గొన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగతో పల్లెలు కళకళలాడుతున్నాయన్నారు. కోడి పందేలు కోడికి కత్తి కట్టకుండా నిర్వహించాలని సూచించారు. సంప్రదాయబద్ధంగా సంక్రాంతి వేడుకలు ప్రతి ఒక్కరు ఆనందోత్సవాలతో జరుపుకోవాని కోరారు. అనంతరం కోడి పందేలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరిగ చంద్రారెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, చెంచల రామిరెడ్డి, ఉయ్యూరు ఉమమహేశ్వరరెడ్డి , వివిధ గ్రామాల నాయకులు, కర్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయం

రాజ్యసభ సభ్యులు ఆయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్



మున్నంగిలో అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎంపీ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్

మున్నంగి(కొల్లిపర): పాఠశాల అభివృద్ధి కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సహకరించి భావితరాలకు మౌలిక వసతులతో అదనపు తరగతి గదులు నిర్మించటం అభినందనీయమని రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని మున్నంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు నిర్మించిన గదులను ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన విధంగా శ్రద్ధగా చదువుకుంటే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నాడు-నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి, మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి వెంకటరామకృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ శివనాగిరెడ్డి, గ్రామ పెద్దలు ఆరిగ కోటిరెడ్డి తదితరలు పాల్గొన్నారు.

అయోధ్యరాముని అక్షింతల పంపిణీ



అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న పసులేటి శివ

పొన్నూరు: అయోధ్యరాముని అక్షంతలు, స్పర్శ పంపిణీ కార్యక్రమం శ్రీరామ మందిరం ధర్మకర్తలు చైర్మన్ పసులేటి శివ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పొన్నూరు, నిడుబ్రోలులో అక్షంతల కలశంతో ప్రధాన వీధుల్లో శోభాయాత్ర శ్రీరామ నామస్మరణతో జరిగింది. భక్తులు కలశాన్ని తమ తలపై ధరించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ దినం భారతీయులందరికీ పండుగ రోజు అని, ప్రతిష్ఠ ఆహ్వానం, రాములవారి అక్షంత ప్రసాదాన్ని పట్టణంలో ప్రతి కుటుంబానికి చేరుస్తున్నామని శివ తెలిపారు. ఆవుల సంఘం చలపతిరావు, బండారు శ్రీను, బావిరెడ్డి బ్రహ్మం, బావిరెడ్డి సుబ్బారావు, గద్దే రత్తయ్య, దాసరి రమేష్, తాడిశెట్టి గోపీరాజు, మహిళలు పాల్గొన్నారు.



మంచులో వాకింగ్ చేస్తున్న ప్రజలు



మారీసుపేటలో కురుస్తున్న మంచు



బుర్రిపాలెం రోడ్డులో పంట పొలాలను కప్పిన మంచు

తెనాలిని కప్పేసిన మంచు

తెనాలి పట్టణంలో ఆదివారం ఉదయం మంచు కప్పేసింది. ఉదయం నుంచి విపరీతమైన మంచు కురవడంతో రోడ్లు కనిపించలేదు. తెల్లవారు జాము నుంచి ఉదయం 10 గంటల వరకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అది కాకుండా భోగీ పర్వదినం కావటంతో ముంచులోనే భోగి మంటలు వేసి చలి కాచుకున్నారు. పట్టణంలోని మారీసుపేట, అయితానగర్, బుర్రిపాలెం రోడ్డు ప్రాంతాలలో మంచు ఎక్కువగా కన్పించింది. - తెనాలి అర్బన్